తారెత్తిస్తున్న వరుస చోరీలు

- బెంబేలెత్తుతున్న ప్రజలు
- పత్తాలేని పోలీసు గస్తీ



శ్రీరంగరాజుపల్లిలో కృష్ణారెడ్డి ఇంట్లో జరిగిన చోరీ ఘటనపై వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పరిగి: వేసవి కాలం.. ఉక్కపోత ఓ వైపు.. దోమల బెడద మరోవైపు..ఉపశమనం పొందడానికై రాత్రివేళ మిద్దెలెక్కి నిద్రించడానికి ఆసక్తి చూపుతుండడంతో ఇదే అదునుగా చూసుకొని దొంగలు ఇళ్లలోకి ప్రవేశించి దోపిడీలకు పాల్పడుతున్నారు. పోలీసుల గస్తీ మాత్రం లేదు. నియోజకవర్గంలో దొంగతనాలను అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని ప్రజలు అంటున్నారు. వెంటనే సరిహద్దు చెక్‌పోస్టులను వినియోగంలోకి తెచ్చి, సీసీ కెమెరాలను పునరుద్ధరిస్తే చోరీలను అరికట్టొచ్చని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గంలోని పరిగి, పెనుకొండ, గోరంట్ల మండలాల్లో జరిగిన వరుస దొంగతనాలు ఇటీవల కాలంలో ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయి. మిద్దెపైన, ఆరుబయట నిద్రిస్తున్న వారిని దోపిడీ దొంగలు టార్గెట్ చేస్తున్నారు. వీరితో పాటు ఇంటికి తాళం వేసిన వాటిపైనే దృష్టి సారిస్తున్నారు. అర్ధ రాత్రి 12 నుంచి 3 గంటల సమయాల్లో ఎక్కువగా ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయి.

రెండ్రోజుల్లోనే మూడు చోరీలు..

- పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లిలోని స్థానిక జిల్లా పరిషత్ స్కూల్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి ఇంట్లో ఏప్రిల్ 30న దొంగతనం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి దుండగులు ఇంటి తలుపు గడియ ధ్వంసం చేసి, లోపలకి ప్రవేశించి, బీరువాల్లోని ఉంచిన ఉంగరం, రూ.16,500 నగదు తీసుకెళ్లారు. ఆలయ హుండీని ఎత్తుకెళ్లారు. మోదా గ్రామంలో అదే రోజు రాత్రి రిటైర్డ్ హెచ్‌ఎం అంజినప్ప ఇంట్లో 5 తులాల బంగారు, రూ. 20 వేల నగదు ఎత్తుకెళ్లారు.

మరుసటి రోజు మరో చోరీ..

పరిగి మండలంలోని కాలువపల్లి గేట్ సమీపంలోని గార్మెంట్స్ పరిశ్రమ వద్ద హిందూపురం- మడకశిర ప్రధాన రహదారి పక్కనున్న లోకేష్ హోటల్‌లో ఈనెల 1న దొంగతనం జరిగింది. 24 గంటల్లోపే ఇలా రెండో చోరీ జరిగింది.

- పెనుకొండ, వెంకటాపురం తండాలో ఏప్రిల్ 28న లచ్చేనాయక్, శ్రీనివాసనాయక్ ఇళ్లలో దొంగతనం జరిగింది. ఈ వేర్వేరు సంఘటనల్లో గోల్డ్ చైన్‌తో పాటు 3 ఉంగరాలు, రూ. 55 వేలు నగదు దొంగలు దోచికెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- సోమందేపల్లి మండలంలో ఏప్రిల్ 21న కొత్తపల్లి క్రాస్ వద్ద ప్రభాకర్ అనే వ్యక్తి బైకును అపహరించారు. ఏప్రిల్ 25న సోమందేపల్లిలోని సాయినగర్‌లో నివాసముంటున్న లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. రూ. 50 వేల నగదు, రెండున్నర తులాల నగలు ఎత్తుకెళ్లారు. మరుసటిరోజు 26న మంచేపల్లికి చెందిన ఓ రైతు పొలంలో విద్యుత్‌మోటారుకు 220 మీటర్ల కేబుల్ ఎత్తుకెళ్లారు.
- గోరంట్ల మండలంలోని గుంతపల్లిలో ఏప్రిల్ నెలలో హనుమంతరెడ్డి ఇంట్లో తులం బంగారం, రూ.50 వేలు, నగదు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకుంటాం



ఇకపై చోరీలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అన్ని మండలాల్లో బీట్ సిస్టంను అప్రమత్తం చేశాం. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ జరిగిన ఘటనల్లో క్లూస్ టీమ్ ఇచ్చే ఆధారాలతో త్వరలో దుండగులను పట్టుకుంటాం. సిబ్బంది కొరత ఉంది. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలతో నిఘా పెంచాం.

– హుస్సేన్‌పీరా, డీఎస్పీ, పెనుకొండ



పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

లేపాక్షి: హిందూపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొండూరు మల్లికార్జున కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన లేని లోటు పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేసారు. అలాగే రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి కూడా మల్లికార్జున కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు నీలావతి, అంజినరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

హిందూపురం టౌన్: రాబోవు మూడు రోజుల పాటు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల సహాయార్థం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రామాంజనేయరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జ్‌గా గురుప్రసాద్‌ను నియమించామని, తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొనే ప్రజలు కంట్రోల్ రూమ్ నంబర్ 8790244895కు సంప్రదించాలని ఆయన సూచించారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి



ఎస్‌ఐలతో సమీక్షిస్తున్న జడ్జి ఆర్ అశోక్‌కుమార్

మడకశిరరూరల్: ఈనెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక కోర్టు హాల్‌లో జడ్జి శుక్రవారం సీఐ, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీకి ఆవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకునేలా చూడాలన్నారు. పెండింగ్ కేసులున్న వారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయ సందర్శన

లేపాక్షి: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ చేతన్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. మడకశిర నుంచి వచ్చిన ఆయన కార్యాలయాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో అధికారులు, సిబ్బంది పనితీరు తెలుసుకున్నారు.

నీటి సమస్య తీర్చండి

మడకశిరరూరల్: గౌడనహళ్లి బీసీ కాలనీలో కొత్తగా వేసిన బోరుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి నీటి సమస్య తీర్చాలని మహిళలు శుక్రవారం మెళవాయిలో జాయింట్ కలెక్టర్ చేతన్‌కు వివరించారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోయారు. జేసీ స్పందించి గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా వెంటనే సమస్యను తీర్చాలని ఎంపీడీఓ సానిబాయికి సూచించారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసే వరకు రోజు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయిస్తామని ఎంపీడీఓ వివరించారు. గ్రామాల్లో నీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని జేసీ అధికారులకు సూచించారు.

రైలు పట్టాలపై రాళ్లు పెడితే చర్యలు



కాలనీవాసులతో మాట్లాడుతున్న రైల్వే పోలీసులు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీ వద్ద ఉన్న రైలు పట్టాలపై రాళ్లు పెడితే చర్యలు తప్పవని రైల్వే పోలీసులు హెచ్చరించారు. శుక్రవారం హిందూపురం రైల్వే పోలీసులు కాలనీలో పర్యటించారు. ఇటీవల కొందరు రైల్వే పట్టాలపై రాళ్లు అడ్డంగా పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, భవిష్యత్‌లో ఇలాంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం విక్రేతల అరెస్ట్



నిందితులను చూపుతున్న పోలీసులు

గోరంట్ల: కర్ణాటక నుంచి గోరంట్ల మండలంలోకి మద్యం తెస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు శుక్రవారం తెలిపారు. వారి నుంచి 1,050 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టయిన వారిలో నల్లమాడ మండలం మసకవంకపల్లికి చెందిన మోహన్, కర్ణాటక రాష్ట్రం గుళూరుకు చెందిన పవన్‌కుమార్, ఆలం జనార్దన్ ఉన్నారని తెలిపారు.

జోరుగా జేడీఎస్ రోడ్ షో



రోడ్ షోలో పాల్గొన్న కార్యకర్తలు

పావగడ: స్థానిక విధాన సభ ఎన్నికలు ఈ నెల 10 న జరుగుతున్న నేపథ్యంలో జేడీఎస్ ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేసింది. వైఎన్‌హొసకోటలో శుక్రవారం జేడీస్ అభ్యర్థి కేఎం తిమ్మరాయప్ప నేతృత్వంలో రోడ్ షో నిర్వహించారు. జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

జూన్ 12లోపు పనులు పూర్తి చేయాలి



శ్రీరంగరాజుపల్లిలో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామాంజనేయులు

పరిగి: ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందని, ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు-నేడు పనులను జూన్ 12 లోపు పూర్తి చేయాలని డ్వామా పీడీ రామాంజనేయులు ఆదేశించారు. శుక్రవారం ఆయన పరిగి, శ్రీరంగరాజుపల్లిలో జరుగుతున్న నాడు- నేడు పనులు, ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు. తొలుత గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. పనికి తగ్గ వేతనం ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. పని కల్పించలేదన్న ఊసే వినపడకూడదన్నారు. ఉపాధి పనుల్లో ఏవైనా అక్రమాలు జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి..

శ్రీరంగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న రెండో దశ నాడు-నేడు పనులను డ్వామా పీడీ రామాంజనేయులు పరిశీలించారు. ఇంత వరకూ జరిగిన పని నాణ్యతను ఆయన అభినందించారు. దాదాపు రూ.1.15 కోటి లక్ష్యంతో చేపడుతున్న నాడు-నేడు పనులతో పాఠశాల రూపు రేఖలు మారబోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ లక్ష్మీదేవి, ఏపీఓ చంద్రశేఖర్, హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు కృష్ణారెడ్డి, కిరణ్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వివేక్ నాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

రొద్దం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని పలు మార్లు చెప్పినా కూలీల సంఖ్య పెంచకపోతే ఎలా? అని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం భవనంలో ఉపాధి హామీ పథకంపై ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. పెరిగిన వేతనాన్ని కూలీలకు వివరించి, పనులపై అవగాహన కల్పించి, కూలీల సంఖ్య పెంచడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీశ్వర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తనిఖీలు

చిలమత్తూరు: మండలంలోని యగ్నిశెట్టిపల్లి, వై.గొల్లపల్లి గ్రామాల్లో ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. కర్ణాటక మద్యం, గుట్కా విక్రయించకూడదని హెచ్చరించారు. గ్రామాల్లో గొడవలు చోటుచేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. పేకాట, మట్కా వంటి జూదాలు ఆడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి కల్యాణం



రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

రొళ్ల: కాల్వేపల్లిలో వెలసిన రంగనాథస్వామి ఆలయంలో స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి మూల విగ్రహాన్ని వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ రంగనాథ స్వామి, శ్రీదేవి, భూదేవికి కల్యాణాన్ని జరిపించారు. శుక్రవారం ఉదయం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. శనివారం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆదర్శ పోలింగ్ కేంద్రం

పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రం ఎన్నికల నేపథ్యంలో మొత్తం 246 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రొప్పం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం ఆకట్టుకుంటోంది. ఇదిలా వుంటే నియోజక వర్గం వ్యాప్తంగా 18 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా పోలీసులు గుర్తించారు. వీటిలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా లక్ష్మీవేంకటరమణస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

మడకశిర: పట్టణంలో వెలసిన కోట వేంకటరమణ స్వామి బ్రహ్మ రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి శ్రీవారికి అభిషేకాలు, అలంకరణ, తిరుమంజనం, తోమాల సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. తహసీల్దార్ బాలాంజనేయులు ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత వైసీ గోవర్ధన్ రెడ్డి దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో గోవింద నామస్మరణతో ఉత్సవ విగ్రహాలను ఆలయం నుండి ఊరేగింపుగా తేరు వీధి వరకు తీసుకెళ్లి రథంపై ఉంచారు. ఆతర్వాత భక్తులు రథాన్ని కొద్ది దూరం వరకు లాగారు.

ప్రజలు రథంపైకి బొరుగులు,అరటికాయలు తదితర వాటిని విసిరి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో మేళ తాళాలతో ఊరేగించారు. ఈసందర్భంగా అయ్యప్పస్వామి సేవాసమితి, బ్రాహ్మణ సంఘం, ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం క్రమాన్ని నిర్వహించారు.

బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శివారెడ్డి

చిలమత్తూరు: గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని డీఎల్‌డీఓ శివారెడ్డి సూచించారు. మండలంలోని మొరసలపల్లి అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయం, కొడికొండ గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో అందిస్తున్న సేవలు విస్తృతం చేయాలన్నారు. ఫిర్యాదులు రాకుండా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్, కార్యదర్శులు నాగరాజు, రామ్లా నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం టౌన్: మండలంలోని సంతేబిదనూరులో ఆంజనేయస్వామి రథోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీపై మోసుకుంటూ తీసుకువచ్చి రథంలో కొలువుదీర్చారు. వేలాది మంది భక్తుల నడుమ రథోత్సవం వైభవంగా సాగింది. రథోత్సవంలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. అలాగే రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ రథోత్సవానికి హాజరై, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, జెడ్పీటీసీ నాగభూషణం, సర్పంచ్ ఆనంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బసిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాము, బక్రు సాబ్, రామాంజి, మల్లేష్, ఆనంద్‌రెడ్డి, బసప్ప, సీపీసీ సాధిక్ పాల్గొన్నారు.

రగ్బీ రాష్ట్రస్థాయి విజేతలకు అభినందనలు



రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: కర్నూలులో జరిగిన 8వ రాష్ట్రస్థాయి రగ్బీ చాంపియన్ షిప్ పోటీలో ప్రతిభ కనబరిచిన ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులను ప్రిన్సిపాల్ ప్రగతి అభినందించారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థినులకు ప్రశంసాపత్రాలను అందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా రగ్బీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కళాశాల విద్యార్థినులు వందన, హేమలత రాష్ట్ర స్థాయి గెలుపులో కీలక భూమిక పోషించారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తిరుమలమ్మ, ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మి అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంతర్జాతీయ మిడ్ వైఫరీ దినోత్సవం

పరిగి: మోదా పంచాయతీ పరిధిలో ఉన్న పుట్టగూర్లపల్లిలో అంతర్జాతీయ మిడ్ వైఫరీ దినోత్సవాన్ని వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు సుఖమయ, క్షేమకరమైన ప్రసవం జరుగుతుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యాయామం చేయడం వల్ల శరీర సౌష్టవం పెరిగి, ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, ఆరోగ్య కార్యకర్తలు నాగరాజు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వేతనం అందజేత

పరిగి: మండలంలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించిన సహాయకురాలు గంగమ్మకు ఏడాది వేతనం ఇచ్చేందుకు దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు ముందుకొచ్చారు. పాఠశాలలో రెగ్యులర్ ఆయా పోస్టు ఖాళీగా ఉండటంతో నిర్వహణ విషయాన్ని ప్రిన్సిపాల్ కరీం గత డిసెంబర్ నెలలో ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావును సంప్రదించారు. స్పందించిన ఆయన ఏడాది పాటూ ప్రతి నెలా రూ.5 వేలు ఆర్థిక సహాయం చేస్తానని ప్రిన్సిపాల్‌కు హామీ ఇచ్చారు.

కార్మికుల అభ్యున్నతికి పాటు పడండి

పెనుకొండ: కార్మికుల అభ్యున్నతికి పాటు పడాలని సీఐటీయూ నాయకులు రమేష్, హరి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్‌ను ఎస్ఐ రమేష్‌బాబు ప్రారంభించారు.

ముగిసిన వృద్ధుల పోలింగ్

పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రం ఎన్నికలలో భాగంగా 80 ఏళ్లకు పై బడిన వృద్ధుల పోలింగ్ ముగిసినట్లు సంబంధిత అధికారి రుద్రేశ్ శుక్రవారం తెలిపారు. వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు 1,029 మంది ఉన్నారు. వీరి పోలింగ్ కు ప్రత్యేక సిబ్బంది ని ఏర్పాటు చేశారు. అలాంటి ఓటర్ల ఇళ్ళ వద్ద కే పోలింగ్ సిబ్బంది వెళ్లి అక్కడే రహస్య పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. వీరిలో 970 మంది వృద్ధులు, 34 మంది దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పంటకోత ప్రయోగాలు

పెనుకొండ రూరల్: మండలంలోని కోనాపురంలో రబీ సీజన్‌లో సాగు చేసిన పంట కోత ప్రయోగాలు అధికారులు శుక్రవారం నిర్వహించారు. రైతు రామచంద్రమ్మ పొలంలోని 25 చదరపు మీటర్లలో పంటకోత చేయగా, 19.230 కేజీల దిగుబడి, కవితాబాయి పొలంలోని 17.100 కేజీల దిగుబడి వచ్చినట్లు అసిస్టెంట్ స్టాటిటిక్స్ ఆఫీసర్ బాబుప్రసాద్ రెడ్డి తెలిపారు.

పాఠ్య పుస్తకాలు సరఫరా

గుడిబండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు శుక్రవారం ఎంఈఓ కార్యాలయానికి చేరాయి. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి 66,367 పుస్తకాలు అవసరం కాగా మొదటి విడతలో ప్రభుత్వం మండలానికి 24,234 పుస్తకాలను సరఫరా చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు, యూనిఫాం, షూ, సాక్స్, బ్యాగు, నోటుపుస్తకాలు అందజేస్తామన్నారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

రొద్దం: రాబోవు విద్యాసంవత్సరానికి అన్ని తరగతుల విద్యార్థులకూ ముందుగానే పాఠ్యపుస్తకాలు సరఫరా చేసినట్లు ఎంఈఓ ఆంజనేయులునాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీకి చేరినట్లు తెలిపారు. పాఠశాలలు ప్రారంభం కాకముందే పాఠ్య పుస్తకాలు సరఫరా కావడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

ఘనంగా లక్ష్మీరంగనాథస్వామి రథోత్సవం

అమరాపురం: పేలుబండ గ్రామంలో వెలసిన లక్ష్మీరంగనాథ స్వామి రథోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంకాలం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి రథం వద్దకు మేళా తాళాలతో తీసుకొచ్చారు. పూజల అనంతరం రథంలో కూర్చొబెట్టి గ్రామ వీధుల్లో రథాన్ని లాగారు. ఈ సందర్భంగా భక్తులు అరటిపండు, బెల్లం, బొరుగులు, పూలను రథంపైకి విసరి మొక్కులు తీర్చుకున్నారు.

6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అమరాపురం: హాలుకూరు సమీపంలో ఉన్న మోడల్ స్కూల్‌లో 2023-24కు సంబంధించి 6వ తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఓబశపతి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5 వ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 9 నుంచి 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 6300178861 నంబరులో సంప్రదించాలని సూచించారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలి

గుడిబండ: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ జయసింహా, ఎంపీడీఓ రామారావు ఉపాధి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని, ఉపాధి కూలీలకు పనులు చేయడానికి సులభంగా ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామసభను ఏర్పాటు చేసి జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. మండలంలో రోజూ 4,000 మందికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఏపీఓ భార్గవి, ఈసీ లక్ష్మానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తూ వ్యక్తి అరెస్ట్

రొద్దం: మండల సరిహద్దు కర్ణాటక రాష్ట్రం దొమ్మితమర్రి నుంచి పెనుకొండ మండలం శెట్టిపల్లికి మద్యం తరలిస్తూ ఓ వ్యక్తి పోలీసులకు శుక్రవారం పట్టుబడ్డాడు. పెనుకొండ-మడకశిర ప్రధాన రహదారిపై చెరుకూరు చెక్‌పోస్ట్ వద్ద ఆర్టీసీ బస్సుల్లో తనిఖీ చేస్తుండగా, మద్యంతో శెట్టిపల్లికి చెందిన శివారెడ్డి అనే వ్యక్తి ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. అతని నుంచి 90 ఎంఎల్ 50 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ జమేదార్ బీమ్లానాయక్ పాల్గొన్నారు.

పాలిసెట్ మోదిరి పరీక్ష

హిందూపురం టౌన్: స్థానిక బీవీటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పాలిసెట్ పరీక్షను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ పరీక్ష ప్రశ్నపత్రాలను ప్రిన్సిపాల్ రమేష్, చిన్మయ కోచింగ్ సెంటర్ వెంకట్, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ నాగేంద్ర, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో భయాందోళనను తొలగించడానికి ఈ పరీక్ష ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు దేవరాజ్, కార్తీక్ మోహన్, సాయి కిరణ్, పవన్ కుమార్, జితేంద్ర, వరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం ఏర్పాటు

పెనుకొండ: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేశారు. సర్వజనాస్పత్రిలో రోగులు, గ్రామీణులు, యాచకులు, వైద్య సిబ్బందికి అన్నదానం చేసినట్లు సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు.

ఘనంగా జలధి ఉత్సవం



జలధి ఉత్సవానికి తరలి వెళుతున్న దేవతలు

అమరాపురం: బసవనపల్లిలో మహాలక్ష్మి, స్వారమ్మ, భూతప్ప దేవతలకు భక్తులు శుక్రవారం జలధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో దేవతమూర్తుల ఉత్సవ విగ్రహాలకు అర్చకులు పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో గ్రామ పొలిమేరలో ఉన్న వంక వద్దకు తీసుకెళ్లి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంకాలం ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని ఆలయాల వద్దకు తీసుకొచ్చారు.